E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD సంపుటి :01 సంచిక :257 బుధవారం 26 ఆగస్టు 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

## ఏకగ్రీవం చేస్తే టికెట్ కట్!

ఏకగ్రీవాలపై జగన్ కీలక హెచ్చరిక
స్థానిక పోరుకు వైసీపీ రెడీ
కార్యకర్తలకు అండగా ఉండాలని పిలుపు
బలమైన అభ్యర్థుల ఎంపికపై ఫోకస్
గెలుపే లక్ష్యం.. ఈగోలకు నో
60 రోజులు నియోజకవర్గాల్లోనే ఉండాలి
పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి



2 లో

**న్యూస్ డెస్క్, 25 ఆగస్టు (తెలుగు గళం):** స్థానిక సంస్థల ఎన్నికలపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే ప్రజలు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్పష్టమైన తీర్పు ఇస్తారని అన్నారు. గతంలో స్థానిక ఎన్నికల సందర్భంగా అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు, ప్రలోభాలు చూశామని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆషామాషీగా తీసుకోవద్దని జగన్ సూచించారు.

## రేవంత్ విదేశీ టూర్‌పై కొత్త రగడ!

రేవంత్‌పై అర్వింద్ సంచలన ఆరోపణలు
దేశ భద్రతకే ముప్పంటూ ఫైర్
రేవంత్ విదేశీ టూర్‌పై తీవ్ర విమర్శలు
దేశ వ్యతిరేక శక్తులతో సంబంధాలంటూ ఆరోపణ
రేవంత్ కదలికలపై నిఘా తప్పదంటూ వ్యాఖ్య
విద్యారంగంపై సర్కారుకు చురకలు
ఫీజు బకాయిలపై అర్వింద్ ఆగ్రహం

2 లో

## నకిలీ వైద్యుల గుట్టురట్టు!

హైదరాబాద్‌లో నకిలీ వైద్యుల కలకలం
11 మంది ఫేక్ డాక్టర్లు అరెస్ట్
అర్హత లేకుండానే వైద్య సేవలు
ప్రిస్క్రిప్షన్లు, ఇంజెక్షన్లతో మోసం
క్లినిక్‌లపై పోలీసుల మెరుపు దాడులు

2 లో

## సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమరం!




2 లో

సమావేశాల నిర్వహణపై తొలి రోజే నిర్ణయం
కీలక బిల్లులు, విధానాలపై ప్రభుత్వ కసరత్తు
ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై విపక్షాల పోరాటం
పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై సభలో ప్రశ్నలు
22ఏ జీవోపై ప్రభుత్వాన్ని నిలదీయనున్న ప్రతిపక్షాలు
అసెంబ్లీలో అధికార విపక్షాల మధ్య హీట్ పెరగనుంది

## కుల వివక్షపై పోరాటం

సామాజిక సమానత్వమే లక్ష్యం
అగ్రవర్ణ మహనీయుల సేవల ప్రస్తావన
బుద్ధుడు, మహావీరుడి సందేశం
బసవణ్ణ వివక్షకు వ్యతిరేకం
వివేకానంద సమానత్వ బోధన
సాహూ మహారాజు రిజర్వేషన్లకు బాట
అల్లూరి గిరిజనుల కోసం పోరాటం
మహనీయుల సేవలను గుర్తుచేసిన కవిత



**న్యూస్ డెస్క్, 25 ఆగస్టు (తెలుగు గళం):** భారత చరిత్రలో శతాబ్దాలుగా పేరుకుపోయిన కుల వ్యవస్థ, అంటరానితనం, సామాజిక అసమానతలను రూపుమాపేందుకు ఎందరో మహనీయులు శ్రమించారని, ముఖ్యంగా సాంప్రదాయక అగ్రవర్ణాల్లో జన్మించినా తమ సామాజిక హోదాను పక్కనపెట్టి దళిత, బహుజన వర్గాల హక్కుల కోసం పోరాడిన చారిత్రక పురుషుల పాత్ర మరువలేనిదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఒక ప్రత్యేక వ్యాసంలో పలువురు సంఘ సంస్కర్తల సేవలను స్మరించుకున్నారు.


క్రీస్తు పూర్వం 6వ శతాబ్దం నుంచే సమాజంలో ఉన్నత వర్గాలకు చెందిన వారు నిమ్న వర్గాల అభ్యున్నతికి బాటలు వేశారని కవిత తెలిపారు. రాజ కుటుంబాలను వదులుకుని సమాజంలో నైతిక, ఆధ్యాత్మిక విప్లవాన్ని తెచ్చిన గౌతమ బుద్ధుడు, వర్ధమాన మహావీరుడు పుట్టుకతో ఎవరూ గొప్పోళ్లు కాదని, కరుణ, జ్ఞానమే మనిషి విలువను నిర్ణయిస్తాయని చాటిచెప్పారని గుర్తుచేశారు.

2 లో

## తెలుగు రాష్ట్రాలకు వర్ష గండం

అల్పపీడన ప్రభావంతో వర్షాల జోరు
ఏపీ తీరంలో ఈదురుగాలుల బీభత్సం
మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దు
తెలంగాణలో భారీ వర్షాలకు అవకాశం
పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు
రైతులు, వాహనదారులకు కీలక హెచ్చరిక
చెట్లు, విద్యుత్ స్తంభాల వద్ద అప్రమత్తత

2 లో



## రేవంత్ కేబినెట్‌లో ‘మార్పుల’ మంత్రం!

**న్యూస్ డెస్క్, 25 ఆగస్టు (తెలుగు గళం):** కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో శ్రావణ మాసంలో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ఉంటుందని ప్రచారం జోరుగా సాగుతున్నది. ఒకరిద్దరు మంత్రులను తొలగించి, వారి స్థానంలో కొత్తవారిని మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం ఉంటుందని చర్చ జరుగుతున్నది. కేబినెట్ నుంచి తప్పించే జాబితాలో కొండా సురేఖ పేరు తప్పనిసరిగా ఉంటుందని తెలుస్తున్నది. అదేసమయంలో మంత్రుల శాఖలను సైతం మార్చేందుకు ఏఐసీసీ కసరత్తు చేస్తున్నట్టు కాంగ్రెస్ వర్గాల్లో డిస్కషన్ ఉంది.

డెడ్‌లైన్ సెప్టెంబరు 10?

సెప్టెంబరు 10 వరకు శ్రావణమాసం ఉంది. ఈలోపే కేబినెట్ పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని ఏఐసీసీ భావిస్తున్నట్టు తెలుస్తున్నది. అయితే వర్షకాల అసెంబ్లీ సమావేశాలను సెప్టెంబరు7 నుంచి ప్రారంభించి, రెండు మూడు రోజుల పాటు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నది.

మిగతాది 2 లో..

- కేబినెట్ ప్రక్షాళనకు ముహూర్తం?
- ఆ ముగ్గురిపై వేటు?
- సెప్టెంబరు 10లోపే మార్పులు!
- శాఖల మార్పుపైనా కసరత్తు
- ఒప్పించాల్సిన బాధ్యత హైకమాండ్‌దే!
- సురేఖ ఎపిసోడ్‌తో కీలక మలుపు
- కొత్త బెర్తులపై సామాజిక సమీకరణాలు
- ఢిల్లీ పిలుపుపై ఉత్కంఠ
- రాజీనామా.. లేదంటే బర్తరఫ్?

## కులగణనపై కాంగ్రెస్ ఫైర్!

మోదీకి ఖర్గే, రాహుల్ లేఖ
ఓపెన్ ఎండెడ్ విధానం వద్దు
డ్రాప్‌డౌన్ జాబితా పెట్టాలి
కులాల పేర్లతో గందరగోళం వద్దు
ఓబీసీలకు నష్టం జరుగుతుందన్న ఆందోళన
తెలంగాణ, బిహార్ విధానం అమలు చేయాలి
కొత్త ప్రశ్నావళి రూపొందించాలని డిమాండ్
రాజకీయ పార్టీలు, నిపుణులతో చర్చించాలి
కచ్చితమైన కులగణన అవసరం



**న్యూస్ డెస్క్, 25 ఆగస్టు (తెలుగు గళం):** దేశవ్యాప్తంగా సామాజిక న్యాయం అమలు చేయాలంటే కచ్చితమైన కులగణన అత్యవసరమని, అయితే కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కల్లో కులాల నమోదు కోసం ఎంచుకున్న ‘ఓపెన్-ఎండెడ్’ ప్రశ్నల విధానం గందరగోళానికి దారితీస్తుందని లోక్‌సభ, రాజ్యసభ ప్రతిపక్ష నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి వారు ఒక సంయుక్త లేఖ రాశారు.

2 లో

## శ్రీశైలంలో ఘోర విషాదం!



2 లో

**న్యూస్ డెస్క్, 25 ఆగస్టు (తెలుగు గళం):** ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన శ్రీశైలం లో ఎవరూ ఉహించని విషాదం చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం గా మారింది. శ్రీశైలంలోని వడ్డెర సత్రంలో వారు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు.

## విద్యాశాఖ మంత్రులకు సీపీజే చీఫ్ లేఖ!

మంత్రులకు ఆరు కీలక ప్రశ్నలు
స్కూళ్ల పరిస్థితిపై సూటి ప్రశ్నలు
మౌలిక వసతులపై సీపీజే ఆరా
టీచర్ ఖాళీలపై కీలక ప్రశ్నలు
బడ్జెట్ ఖర్చులపై వివరాలు కోరుతూ
కొత్త పాఠశాలలపై సూటి ప్రశ్న
టీచర్లపై పనిభారంపై ప్రశ్నలు



**న్యూస్ డెస్క్, 25 ఆగస్టు (తెలుగు గళం):** దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, అధ్వాన పరిస్థితులపై ‘కాక్రోచ్ జనతా పార్టీ’ వ్యవస్థాపకుడు, కన్వీనర్ అభిజీత్ దిప్కే అన్ని రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులకు బహిరంగ లేఖ రాశారు.

2 లో

## ఓటర్లకు ఈసీ బిగ్ రిలీఫ్




2 లో

92 లక్షల ఓటర్లకు ఊరట
స్వయంగా రావాల్సిన అవసరం లేదు
కుటుంబ సభ్యులకు డాక్యుమెంట్ల అవకాశం
వృద్ధులు, వికలాంగులకు వెసులుబాటు
వలస ఓటర్లకు భారీ ఊరట
బీఎల్‌వోలకు డాక్యుమెంట్ల అందజేత
80 లక్షల నోటీసులు జనరేట్
నోటీసుల పంపిణీ ఇప్పటికే షురూ
ఓట్ల తొలగింపుపై ఆందోళన

# శ్రీశైలంలో ఘోర విషాదం!



**న్యూస్ డెస్క్, 25 ఆగస్టు (తెలుగు గళం):** ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన శ్రీశైలం లో ఎవరూ ఊహించని విషాదం చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం గా మారింది. శ్రీశైలంలోని వడ్డెర సత్రంలో వారు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. అలాగే మృతులను సత్యసాయి జిల్లా బత్తలపల్లి వాసులుగా గుర్తించారు. ఈ నెల 20న శ్రీశైలానికి వచ్చిన కుటుంబ సభ్యులు వడ్డెర సత్రంలోని ఓ రూమ్ లోకి వెళ్లి తలుపులు పెట్టుకున్నారు. గడిచిన మూడు రోజులుగా ఆ రూమ్ నుంచి ఎవరూ బయటకు రాకపోవడంతో సత్రం సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని రూమ్ తలుపులు తెరవగా ఐదుగురు ఆత్మహత్య చేసుకొని ఉండటాన్ని గమనించారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారు. మృతులను బత్తలపల్లి వాసులు అయినా సుధాకర్, ఆదిలక్ష్మి, మల్లేశ్వరి, శ్రీదేవి, మణికంఠగా గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అలాగే మృత దేహాలను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉంటే ప్రముఖ పుణ్య క్షేత్రం అయిన శ్రీశైలంలో అది కూడా శ్రావణమాసంలో ఐదుగురు ఆత్మహత్య చేసుకొవడం తీవ్ర కలకలం గా మారింది.

# ఓటర్లకు ఈసీ బిగ్ రిలీఫ్

**న్యూస్ డెస్క్, 25 ఆగస్టు (తెలుగు గళం):** రాష్ట్రంలో ఎస్ఐఆర్ రెండో దశలో కేంద్ర ఎన్నికల సంఘం నిబంధలను సడలించింది. మ్యాపింగ్ కానీ వారు, పేర్లు, వయస్సు తదితర వాటి వల్ల అనామిలిస్ నోటీసులు అందుకునే వారు స్వయంగా వారే రావాలనే నిబంధనను కేంద్ర ఎన్నికల సంఘం మినహాయించింది. రాష్ట్రంలో వీరు 92 లక్షల వరకు ఉండటంతో ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు స్వయంగా రావడం వల్ల తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని, వీరందరి డాక్యుమెంట్స్‌ను స్వయంగా డాక్యుమెంట్స్ ఇవ్వడానికి ఏఈఆర్‌ఓల వద్దకు వస్తే తక్కువ సమయంలో వీటిని పరిష్కారం కష్టంతరం అవుతుందని గుర్తించారు. అదే సమయంలో వికలాంగులు, వృద్ధులు, విదేశాల్లో ఉన్న వారు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు స్వయంగా తమ ప్రాంతానికి రావడం వ్యయ ప్రయాసాలతో కూడినది కావడంతో ఎన్నికల సంఘం వెసులుబాటు కల్పించినట్టుగా సమాచారం. డాక్యుమెంట్స్‌ను వారి కుటుంబ సభ్యులు ఎవరైనా సంబంధించిన బీఎల్‌వోకు ఇస్తే సరిపోతుందని, ఆ డాక్యుమెంట్స్‌ను బీఎల్‌వో అప్‌డేట్? చేస్తారు. ఈ సమస్య పరిష్కారం అవుతుందని గుర్తించారు. ఈ మేరకు సోమవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్?లో ఆదేశాలు, సూచనలు ఇచ్చినట్టుగా సమాచారం.

నోటీసుల పంపిణీ..

రాష్ట్రంలో ఇప్పటికే 80 లక్షలకుపైగా నోటీసులను జనరేట్ చేశారు. వీటి పంపిణీ కూడా ఇప్పటికే ప్రారంభం అయింది. త్వరలోనే పంపిణీ పూర్తి చేసి వారి డాక్యుమెంట్స్ కలెక్ట్ చేసుకోనున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 73లక్షల ఓట్లు తొలగిపోయాయి. మిగిలిన వాటిల్లో కూడా 92 లక్షల ఓటర్లకు నోటీసులు అందించాల్సి ఉంది. వీరు స్వయంగా వచ్చి డాక్యుమెంట్స్ ఇవ్వాలంటే... అంత భారం భరించే అవకాశం లేదని, ప్రయాణం, సెలవులు, ఉద్యోగాలకు సెలవు పెట్టి సొంత ప్రాంతానికి వచ్చి డాక్యుమెంట్ ఇవ్వడం అనేది కష్టమని, తమ ఓటు పోయినా పరువాలేదని అనుకుంటారని, ఈ నేపథ్యంలో ఇంకా లక్షల సంఖ్యలో ఓట్లు పోయే అవకాశం ఉందని రాజకీయ పార్టీలు, అధికారులు అంచనా వేశారు. దీంతో ఈ సమస్యకు సానుకూలమైన పరిష్కారం దొరకబట్టాలని ఆలోచన చేసి కుటుంబ సభ్యులు అయినా కూడా అవసరమైన డాక్యుమెంట్స్ ఇస్తే పరిపోతుందని వెసులుబాటు కల్పించారు.

# విద్యాశాఖ మంత్రులకు సీపీజే చీఫ్ లేఖ!

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలను ప్రజలకు బహిరంగంగా వెల్లడించాలని ఈ లేఖ ద్వారా డిమాండ్ చేశారు. స్కూల్ ఠీక్ కరో కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో సదుపాయల వాస్తవపరిస్థిపై దృష్టి సారించిన సీజేపీ ఈ మేరకు అన్ని రాష్ట్రాల మంత్రులకు లేఖ రాయడం హాట్ టాపిక్ గా మారింది.

విద్యాశాఖ మంత్రులకు 6 కీలక ప్రశ్నలు:

స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు గడిచినా అనేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, సరైన తరగతి గదులు, ఆఖరికి కూర్చోవడానికి బెంచీలు కూడా లేకపోవడం పట్ల అభిజీత్ దీప్కే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వస్తున్న దృశ్యాలు జంతువుల కంటే దారుణమైన పరిస్థితుల్లో పిల్లలు చదువుకుంటున్నట్లు చూపిస్తున్నాయని, ఇవి ప్రతీ ఒక్కరినీ ఆలోచింపజేయాలని అన్నారు. ప్రాథమిక వసతులే లేనప్పుడు దేశం ఎలా పురోగమిస్తుందని ప్రశ్నిస్తూ, విద్యావ్యవస్థను యుద్ధ ప్రాతిపదికన బాగుచేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల అసలు పరిస్థితి ఏంటో ప్రజలకు తెలియజేయడానికి విద్యాశాఖ మంత్రులకు ఆరు ప్రశ్నలు సంధించారు. ఈ ప్రశ్నలకు వివరాలను బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఆరు ప్రశ్నలు ఇవే:

1.గత ఐదేళ్లలో ఎన్ని ప్రభుత్వ పాఠశాలలను బాగుచేశారు? ప్రస్తుతం ఎన్ని పాఠశాలలకు పూర్తిస్థాయి మరమ్మత్తులు అవసరం?

2. రాష్ట్రంలో మంజూరైన టీచర్ పోస్టులు ఎన్ని, అందులో పనిచేస్తున్నవారు ఎంతమంది, ఖాళీలు ఎన్ని ఉన్నాయి?

3. గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల కోసం ఎంత బడ్జెట్ కేటాయించారు? అందులో అసలు ఖర్చు చేసింది ఎంత?

4. కొత్త పాఠశాలల అవసరం: ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందడానికి ఇంకా ఎన్ని కొత్త ప్రభుత్వ పాఠశాలలు అవసరం?

5. ఉపాధ్యాయులకు బోధన కాకుండా ఇతర ఏయే బోధనేతర బాధ్యతలను అప్పగిస్తున్నారు?

6.ఎంతమంది విద్యార్థులకు కంప్యూటర్లు, డిజిటల్ విద్య, శుభ్రమైన మరుగుదొడ్లు, ఆట వస్తువులు అందుబాటులో ఉన్నాయి?

రాజకీయాంశం కాదు:

ఇది ఏ ఒక్క ప్రభుత్వానికో లేదా రాజకీయ ఉద్యమానికో సంబంధించిన అంశం కాదని, మన పిల్లల భవిష్యత్తుకు సంబంధించినదని దీప్కే లేఖలో పేర్కొన్నారు. ప్రతీ చిన్నారికి సురక్షితమైన తరగతి గది, తాగునీరు, మరుగుదొడ్డి మరియు బోధించడానికి ఉపాధ్యాయుడు ఉండటం వారి ప్రాథమిక హక్కు అని స్పష్టం చేశారు.

# సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమరం!

**న్యూస్ డెస్క్, 25 ఆగస్టు (తెలుగు గళం):** తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ, సామాజిక పరిణామాల నేపథ్యంలో ఈ సమావేశాలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఉభయ సభలను ఎన్ని రోజుల పాటు నిర్వహించాలనే అంశంపై తొలి రోజు సమావేశం అనంతరం స్పీకర్ నేతృత్వంలో జరిగే శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ భేటీలో అధికారికంగా నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం పలు కీలక బిల్లులు, విధానపరమైన నిర్ణయాలను సభ ముందు ఉంచే అవకాశమున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీసేందుకు ప్రధాన ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, పాలిటెక్నిక్ కళాశాలల సమస్యలు మరియు రిజిస్ట్రేషన్ల చట్టంలోని వివాదాస్పద 22 ఏ జీవో అమలు పై సభలో నిలదీసేందుకు విపక్షాలు కార్యాచరణ రచిస్తున్నాయి. ప్రజా సమస్యలపై శాసనసభ వేదికగా అధికార, ప్రతిపక్షాల మధ్య వాడివేడి చర్చలు, మాటల యుద్ధం జరిగే అవకాశముండటంతో ఈ సమావేశాలపై రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# తెలుగు రాష్ట్రాలకు వర్ష గండం



**న్యూస్ డెస్క్, 25 ఆగస్టు (తెలుగు గళం):** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో రాగల రెండు నుంచి మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. దీని ప్రభావంతో ఏపీలోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. ముఖ్యంగా తీరప్రాంతం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశముండటంతో సముద్రం అల్లకల్లోలంగా మారే ప్రమాదముందని అధికారులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ప్రమాదాల నివారణకు మత్స్యకారులెవరూ సముద్రంలోకి వేటకు వెళ్లకూడదని విపత్తు నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది.

మరోవైపు తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో గంటకు దాదాపు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే ఆస్కారముందని అధికారులు పేర్కొన్నారు. ఆకాశం మేఘావృతమై ఉంటూ ఉక్కపోత నుంచి ఉపశమనం లభించడంతో పాటు కొన్నిచోట్ల ఈదురుగాలులతో కూడిన జల్లులు పడే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బలహీనమైన నిర్మాణాలు, చెట్లు, విద్యుత్ స్తంభాల కింద ఉండకూడదని, రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను తడవకుండా భద్రపరుచుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

తెలంగాణలో పగటి ఉష్ణోగ్రతలు, తీవ్రమైన ఉక్కపోత ప్రభావంతో వాతావరణంలో సంభవించిన మార్పుల వల్ల రాష్ట్రంలో మోస్తరు నుంచి తీవ్రమైన వర్షాలు కురిసే అవకాశముందని తెలంగాణ వెదర్ మ్యాన్ వెల్లడించారు. తాజా అలర్ట్ ప్రకారం పశ్చిమ, మధ్య, తూర్పు తెలంగాణ జిల్లాల్లో మధ్యాహ్నం వేళ ప్రారంభమై మరుసటి రోజు ఉదయం వరకు చెదురుమదురుగా ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. ఎండ వేడిమి వల్ల ఏర్పడిన ఉష్ణప్రసరణ ప్రక్రియ వర్ష మేఘాల ఏర్పాటుకు దోహదం చేయడంతో ఈ వర్షాలు కురువనున్నట్లు అంచనా వేశారు. ముఖ్యంగా సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి, నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, సిద్దిపేట, యాదాద్రి-భువనగిరి, జనగామ, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి-కొత్తగూడెం, నల్గొండ జిల్లాల్లో మధ్యాహ్నం నుంచి రాత్రి వేళల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి తీవ్ర వర్షాలు నమోదయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా రైతులు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# కుల వివక్షపై పోరాటం

మొదటి పేజీ తరువాయి

మధ్యయుగంలో బసవణ్ణ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టినా కులం, వృత్తి ఆధారిత వివక్షను వ్యతిరేకించారని, శ్రమకు గౌరవం ఇస్తూ వీరశైవాన్ని ప్రచారం చేశారని తెలిపారు. అలాగే కాయస్థ కులానికి చెందిన స్వామి వివేకానంద అంటరానితనాన్ని తీవ్రంగా ఖండిస్తూ, దళితుల అభ్యున్నతికి విద్య, ఆధ్యాత్మిక సమానత్వం అవసరమని నొక్కిచెప్పారన్నారు.

ఆధునిక భారత చరిత్రలోనూ అగ్రవర్ణాల నుంచి వచ్చి బహుజనుల కోసం కృషి చేసిన వారు ఎందరో ఉన్నారని కవిత పేర్కొన్నారు. కొల్హాపూర్ మరాఠా రాజవంశానికి చెందిన ఛత్రపతి రాజర్షి సాహూ మహారాజు 1902లోనే సంస్థాన ప్రభుత్వ ఉద్యోగాల్లో వెనుకబడిన వర్గాలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించారని, బాబాసాహెబ్ అంబేద్కర్‌కు ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందించారని కొనియాడారు. తమిళనాడులో శ్రీరామలింగ స్వామి సమభావాన్ని ప్రచారం చేయగా, తెలుగు రాష్ట్రాల్లో అల్లూరి సీతారామరాజు గిరిజనులలో ఆత్మవిశ్వాసాన్ని నింపి వారి విముక్తికి పోరాడారని వివరించారు.

వీరితో పాటు మహాత్మా గాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్, దయానంద సరస్వతి, ఆచార్య వినోబా భావే, గురజాడ అప్పరావు, కందుకూరి వీరేశలింగం పంతులు వంటి మహనీయులు తమ జన్మతః వచ్చిన భావజాలాన్ని పక్కనపెట్టి సమాజ మార్పునకు కృషి చేశారని కవిత ఆ వ్యాసంలో పేర్కొన్నారు.


# కులగణనపై కాంగ్రెస్ ఫైర్!

మొదటి పేజీ తరువాయి

ఒకే కులాన్ని వివిధ ప్రాంతాల్లో వేర్వేరు పేర్లు, ఉపకులాలతో పిలుస్తారని, ఓపెన్-ఎండెడ్ విధానంలో ప్రజలు చెప్పిన పేరును యథాతథంగా నమోదు చేస్తే కులాల పేర్లు లక్షల్లో నమోదై మొత్తం డేటా నిరుపయోగంగా మారుతుందని స్పష్టం చేశారు. సరైన గణాంకాలు లేకపోతే వెనుకబడిన (ఓబీసీ), అత్యంత వెనుకబడిన వర్గాలకు విద్య, ఉపాధి, ప్రభుత్వ పథకాల్లో తీవ్ర నష్టం వాటిల్లుతుందని, అసలు ఈ విధానంలో 'వెనుకబడిన తరగతి' అనే పదమే లేకపోవడం శోచనీయమని వారు లేఖలో పేర్కొన్నారు.

దీనికి పరిష్కారంగా ఎస్సీ, ఎస్టీల తరహాలోనే ఇతర కులాల నమోదు కోసం ముందుగానే సిద్ధం చేసిన ఒక 'డ్రాప్-డౌన్' జాబితాను ప్రశ్నావళి లో చేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఈ జాబితాను సామాజిక, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల ప్రభుత్వ రికార్డులు, భారత ఆంత్రోపోలాజికల్ సర్వే ఆధారంగా రూపొందించవచ్చని సూచించారు. ఇప్పటికే తెలంగాణ (2024), బీహార్ (2022) రాష్ట్రాల్లో చేపట్టిన కుల సర్వేల్లో ఇదే మెరుగైన విధానాన్ని అమలు చేశారని గుర్తు చేస్తూ, ఆయా రాష్ట్రాల కులాల జాబితా ప్రతులను లేఖకు జతచేశారు. ప్రస్తుత అశాస్త్రీయ విధానంతో చేపడుతున్న కులగణనను తాము అంగీకరించబోమని, తక్షణమే ఈ ప్రశ్నావళిని రద్దు చేసి రాజకీయ పక్షాలు, నిపుణులు, ప్రజలతో విస్తృతంగా చర్చించి పక్కా ప్రణాళికతో కొత్త ప్రశ్నావళిని రూపొందించాలని ఖర్గే, రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

# నకిలీ వైద్యుల గుట్టురట్టు!



**న్యూస్ డెస్క్, 25 ఆగస్టు (తెలుగు గళం):** మహా నగరం హైదరాబాద్‌లో 11 మంది నకిలీ డాక్టర్లు అరెస్ట్ కావడం తీవ్ర కలకలం గా మారింది. ఎలాంటి వైద్య అర్హతలు లేకుండానే ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న భారీ నకిలీ డాక్టర్ల ముఠా గుట్టును సిటీ పోలీసులు రట్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు నగరంలోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించిన పోలీసులు, డాక్టర్లుగా చలామణి అవుతున్న 11 మంది నకిలీ వైద్యులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కనీస వైద్య విద్య, గుర్తింపు పొందిన డిగ్రీలు లేకపోయినా.. పెద్ద పెద్ద ప్రిస్క్రిప్షన్ రాస్తూ, ఇంజెక్షన్లు, యాంటీబయాటిక్స్ ఇస్తూ సామాన్య ప్రజలను మోసగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

వీరిలో కొందరు నకిలీ సర్టిఫికెట్లతో ప్రైవేట్ క్లినిక్‌లు నడపడమే కాకుండా, మరి కొందరు ప్రముఖ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల పేర్లను వాడుకుంటూ వైద్య సేవలు అందిస్తున్నట్లు విచారణలో తేలింది. వీరి క్లినిక్‌ల నుంచి భారీ ఎత్తున నకిలీ లెటర్‌హెడ్‌లు, అనుమతి లేని మందులు, వైద్య పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అమాయక ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్న ఇలాంటి నకిలీ వైద్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, అర్హత లేని వ్యక్తుల వద్దకు వెళ్లి చికిత్సలు చేయించుకోవద్దని ప్రజలకు పోలీసు ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేశారు.

# సీఎం టూర్.. అర్వింద్ ఫైర్!




**న్యూస్ డెస్క్, 25 ఆగస్టు (తెలుగు గళం):** తన అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవహార శైలి రాష్ట్ర శాంతిభద్రతలకే కాకుండా దేశ భద్రతకు కూడా ముప్పుగా మారిందని ఆయన ఆరోపించారు. మంగళవారం ఓ న్యూస్ ఛానల్‌తో మాట్లాడిన అర్వింద్, సీఎం రేవంత్ విదేశీ పర్యటనలు, పరిపాలనా తీరుపై పలు సంచలన వ్యాఖ్యలు చేశారు.

దేశ వ్యతిరేక శక్తులతో సంబంధాలు:

విదేశాలలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడేందుకు దేశ వ్యతిరేక శక్తులు మాత్రమే ఉన్నాయా అని అర్వింద్ ప్రశ్నించారు. సీఎం విదేశీ పర్యటనల్లో దేశంపై విషం చిమ్మే వారితో చేతులు కలుపుతున్నారని, ఇక్కడ చిచ్చు రగిలించి రాజకీయ లబ్ధి పొందడమే ఆయన లక్ష్యమని ధ్వజమెత్తారు. కేసీఆర్ కంటే రేవంత్ రెడ్డి అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి అని తాను గతంలోనే చెప్పానని గుర్తుచేసిన అర్వింద్, ఇకపై రేవంత్ ప్రతీ కదలిక జాతీయ భద్రతా సంస్థల స్కాన్ కింద ఉంటుందని వ్యాఖ్యానించారు.

ఉన్న వాటికే దిక్కులేదు..

రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించక విద్యాసంస్థలు మూతపడే పరిస్థితికి వచ్చాయని అర్వింద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన బకాయిలను క్లియర్ చేసి, రెగ్యులర్‌గా విడుదల చేస్తామని రాహుల్ గాంధీతో హామీ ఇప్పించి, ఇప్పుడు ఆ హామీని గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఉన్న విద్యా సంస్థలను నాశనం పట్టిస్తూ విదేశాల నుంచి ఏ విద్యాసంస్థలను తీసుకొస్తారని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ చెబుతున్నవన్నీ పనికిమాలిన కథలని కొట్టిపారేశారు. రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకాదని తెలంగాణ ప్రజలు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారన్నారు.

# ఏకగ్రీవం చేస్తే టికెట్ కట్!

మొదటి పేజీ తరువాయి



ఇవి కేవలం గెలుపోటములకు సంబంధించిన ఎన్నికలు కాదని, పార్టీ కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన ఎన్నికలని అన్నారు. అధికార పార్టీ నుంచి ఎలాంటి ఒత్తిళ్లు, దౌర్జన్యాలు ఎదురైనా నాయకుడు తమ వెంట ఉన్నాడనే భరోసా కార్యకర్తలకు కల్పించాలని సూచించారు. పార్టీ ముఖ్య నేతలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు జగన్.. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి పార్టీ రీజనల్ కోఆర్డినేటర్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, 175 అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, స్టేట్ డిప్యూటీ జనరల్ సెక్రటరీలు హాజరయ్యారు..

ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం చేస్తున్న ప్రకటన తమకు అనుకూలంగా మారే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. మున్సిపల్ చైర్మన్, ఎంపీపీ, జడ్పీ చైర్మన్, మేయర్ వంటి కీలక పదవులకు బలమైన అభ్యర్థులను ఎంపిక చేయాలని పార్టీ నేతలకు సూచించారు. అవసరమైన చోట కార్యకర్తలకు అండగా నిలిచేందుకు కుటుంబ సభ్యులను కూడా పోటీలోకి దింపడానికి వెనుకాడవద్దని అన్నారు. ఏకగ్రీవాలకు అంగీకరిస్తే కఠిన నిర్ణయాలు ఉంటాయని జగన్ హెచ్చరించారు. ఏ నియోజకవర్గంలోనూ పోటీ లేకుండా ఏకగ్రీవాలు జరిగేందుకు అవకాశం ఇవ్వొద్దని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే, తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడి కో-ఆర్డినేటర్లు పార్టీ అభ్యర్థులుగా ఉండరని తెలిపారు. ఎన్నికల అనంతరం అభ్యర్థులను ఎక్కడెక్కడ నిలబెట్టారు, వారికి ఎమ్మెల్యే అభ్యర్థులు ఎంత బలంగా మద్దతిచ్చారనే అంశాలపై నివేదికలు తీసుకుంటానని చెప్పారు.

స్థానిక ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య తక్కువగా ఉండటంతో అభ్యర్థి వ్యక్తిగత బలం అత్యంత కీలకమని జగన్ పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపికలో భావోద్వేగాలు, వ్యక్తిగత ఈగోలకు తావివ్వకుండా అందరినీ కలుపుకొని వెళ్లాలని సూచించారు. ఒక్కో ఓటు కూడా కీలకమని, తొమ్మిది ఓట్లతో గెలిచిన సందర్భాలు, తొమ్మిది ఓట్లతో ఓడిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. "గెలుపే ముఖ్యం.. గెలుపు కోసం ఈగోలను పక్కన పెట్టాలి" అని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో పార్టీని బలోపేతం చేసి, సమర్థుడైన కార్యకర్త చుట్టూ ఏకాభిప్రాయం తీసుకురావాలని జగన్ సూచించారు. రాబోయే 60 నుంచి 70 రోజులు నాయకులు తమ నియోజకవర్గాలను దాటి వెళ్లకుండా స్థానిక ఎన్నికలపైనే పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని అన్నారు. ఇంటింటి ప్రచారం ద్వారా వైఎస్సార్‌సీపీ పాలన, కూటమి పాలన మధ్య ఉన్న తేడాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

పోలీసు అధికారులు తమ పదవులను దుర్వినియోగం చేయకుండా న్యాయంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని జగన్ కోరారు. కార్యకర్తలను వేధించే లేదా అన్యాయం చేసే అధికారుల వివరాలను నమోదు చేయాలని పార్టీ నాయకులకు సూచించారు. చట్టవిరుద్ధంగా వ్యవహరించే అధికారులపై భవిష్యత్తులో చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసు అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా తటస్థంగా వ్యవహరించాలని కోరారు వైసీపీ అధినేత వైఎస్ జగన్..

# రేవంత్ కేబినెట్‌లో 'మార్పుల' మంత్రం!

మొదటి పేజీ తరువాయి

దీనితో పునర్వ్యవస్థీకరణ సమావేశాలలోపు చేయాలా ? లేకపోతే ఆ తరువాత చేపట్టాలా? అనే అంశంపై ఆరా తీస్తున్నట్టు తెలిసింది. అయితే ఉన్నపళంగా కొండా సురేఖను మాత్రమే కేబినెట్ నుంచి తప్పిస్తే, మహిళా, బీసీ సామాజిక వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చే ప్రమాదం ఉంటుంది. ఆమె కుమార్తె సుస్మిత సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు చేసినందుకు ప్రతికారంగానే మంత్రి వర్గం నుంచి తొలగించారని విమర్శలు వచ్చే చాన్స్ ఉంది. అందుకని పనితీరు సరిగాలేని మంత్రులను తప్పిస్తే రాజకీయంగా విమర్శలు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుందనే కోణంలో ఏఐసీసీ నేతలు ఆలోచిస్తున్నట్టు తెలుస్తున్నది. పనిలో పనిగా మంత్రుల వద్ద ఉన్న శాఖలను సైతం మార్చాలని అధిష్టానం భావిస్తున్నట్టు సమాచారం. కొందరు మంత్రులు తమ శాఖలను అడ్డంపెట్టుకుని పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నట్టు ఫిర్యాదులు వచ్చాయి. దీనితో అటు మంత్రివర్గ రిషఫ్లింగ్, ఇటు మంత్రుల శాఖల్లో మార్పులు చేపడితే పాలన వ్యవహారంలో భాగంగా మార్పులు, చేర్పులు చేశారని సంకేతాలు వెళ్తాయని అధిష్టానం ఆలోచన చేస్తున్నట్టుగా తెలిసింది.

**ఒప్పించే బాధ్యతలు ఏఐసీసీకి..**

కేబినెట్ నుంచి తప్పించే మంత్రుల జాబితాను ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి అధిష్టానం ముందు పెట్టినట్టు తెలిసింది. సదరు మంత్రులను తప్పించేందుకు ఉన్న కారణాలను సైతం వివరించినట్టు సమాచారం. ఆ మంత్రులతో రాజీనామా చేయించే బాధ్యతలను మాత్రం ఏఐసీసీ పెద్దలు తీసుకునే చాన్స్ ఉందని తెలిసింది. రాజీనామాకు ఒప్పుకోకపోతే నయానో, భయానో దారిలోకి తెచ్చుకునే అవకాశం ఉంది. అయినా ఒప్పుకోకపోతే మాత్రం అప్పుడు బర్తరఫ్ అస్త్రాన్ని ప్రయోగించే అవకాశం ఉంటుందని ఏఐసీసీకి సన్నిహితంగా ఉండే ఓ నేత అభిప్రాయపడ్డారు. అయితే పదవి కోల్పోయిన తరువాత సదరు లీడర్లు మౌనంగా ఉంటారా ? ప్రభుత్వంపై ప్రతిరోజు విమర్శలు చేస్తే ఎలా ?అనే కోణంలో కూడా ఆరా తీస్తున్నారు. అందుకని కేబినెట్ ప్రక్షాళన తరువాత తలెత్తే రాజకీయ పరిణామాలను సైతం అంచనా వేసి, వాటిని కౌంటర్ చేసేందుకు కూడా వ్యూహరచన చేస్తున్నట్టు తెలిసింది.

**తాజా పరిణామాలతోనే ప్రక్షాళన**

మొన్నటి వరకు కేబినెట్ విస్తరణ అవసరం లేదని అటు కాంగ్రెస్ హైకమాండ్, ఇటు రాష్ట్రనేతలు భావించారు. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న రెండు బెర్తులను నింపడం పెద్ద సవాలుగా మారింది. ఎందుకంటే మంత్రి పదవులు ఆశిస్తోన్న ఎమ్మెల్యేల జాబితా చాలా పెద్దగా ఉండటంతో ఎవరిని సంతృప్తి పరచాలో అర్థం కాక మౌనంగా ఉన్నారు. కానీ కొండా సురేఖ కుమార్తె సృష్టించిన వివాదానికి తెర పడాలంటే కేబినెట్ పునర్వ్యవస్థీకరణ తప్పదని నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. కేబినెట్‌లోకి కొత్తగా మున్నూరు కాపు, ఓసీ సామాజిక వర్గంతో పాటు ఎస్టీ సామాజిక వర్గం వారికి అవకాశం దక్కనుంది. పనిలో పనిగా వర్షకాల సమావేశాల్లో పెండింగ్ లో ఉన్న డిప్యూటీ స్పీకర్ ఎన్నికను సైతం పూర్తి చేయాలని భావిస్తున్నారు. సామాజిక,జిల్లాల సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని కేబినెట్ పునర్వ్యవస్థీకరణ, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక జరగనుంది.

**ఏఐసీసీకి నివేదిక :** కొండా సురేఖ ఎపిసోడ్‌లో పార్టీ ఎమ్మెల్యేల ఫిర్యాదుల ఆధారంగా క్రమశిక్షణ సంఘం పీసీసీకి నివేదిక ఇవ్వనుంది. ఆ నివేదికతో పాటు పీసీసీ సైతం తన అభిప్రాయాలను హైకమాండ్‌కు అందచేయనుంది. దీనితో ఏఐసీసీ మంత్రి సురేఖ అంశంపై తుది నిర్ణయం తీసుకోనుంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో సుస్మితా చేసిన ఆరోపణలపై సీరియస్ యాక్షన్ తీసుకోవాలని, లేకపోతే రానున్న రోజుల్లో మరికొంత మంది సీఎంపై విమర్శలు చేసేందుకు అలుసుగా మారే ప్రమాదం ఉందని పలువురు మంత్రులు తమ ఆందోళనను ఏఐసీసీ నేతలకు వివరించినట్టు తెలిసింది. సురేఖ అంశంపై చర్చించేందుకు ఏఐసీసీ నేతలు త్వరలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను ఢిల్లీకి పిలిచే అవకాశం ఉంది.

## ఐపీఎస్ హోదా పొందిన డీసీపీ రాజమహేంద్ర నాయక్‌కు ఘన సన్మానం



**తెలుగు గళం న్యూస్ జనగామ ఆగస్టు 25**

ఐపీఎస్ హోదా పొందిన జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్‌ను బిర్రు ఇస్తారి నాగరత్న సేవా సంఘం అధ్యక్షుడు బిర్రు ఇస్తారి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీసీపీ రాజమహేంద్ర నాయక్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.ప్రభుత్వ అధికారులు ప్రజలకు దగ్గరగా ఉంటూ, ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తే గుర్తింపు దానంతట అదే లభిస్తుందనడానికి డీసీపీ రాజమహేంద్ర నాయక్ మంచి ఉదాహరణ అని బిర్రు ఇస్తారి అన్నారు.ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్న సమయంలో తక్షణమే స్పందించి, సమస్యల పరిష్కారం కోసం నేరుగా కృషి చేసే మనస్తత్వం ఆయనకు ఉందని కొనియాడారు.రాజమహేంద్ర నాయక్‌కు ఐపీఎస్ హోదా లభించడం పట్ల జనగామ జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.ఇప్పటివరకు బాధిత ప్రజల పక్షాన నిలుస్తూ, ప్రజలకు భరోసా కల్పించిన ఆయన భవిష్యత్తులోనూ అదే విధంగా సేవలు అందించాలని ఆకాంక్షించారు.రైతులకు కూడా ఆయన చేదోడువాదోడుగా నిలుస్తున్నారని, ఎండను సైతం లెక్కచేయకుండా సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వారి సమస్యలను తెలుసుకుంటున్నారని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను దగ్గరుండి పరిశీలిస్తూ రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారని తెలిపారు.అలాగే విద్యార్థులు పక్కదారి పట్టకుండా ఎప్పటికప్పుడు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ, యువతను సరైన మార్గంలో నడిపించేందుకు పోలీసు శాఖ ద్వారా పలు కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో బిర్రు ఉమాకాంత్, ఉద్యమకారుల జిల్లా నాయకులు ఈగ మల్లేశం, ఈగం సోమయ్య తదితరులు పాల్గొని డీసీపీ రాజమహేంద్ర నాయక్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# జానపదానికి ప్రభుత్వాలు పట్టం కట్టాలి

## ఎల్ల కళలకు తల్లి వంటిది జానపదం..తెలంగాణకు ప్రాణపదం-సుద్దాల అశోక్ తేజ

**తెలుగు గళం న్యూస్ హైదరాబాద్, ఆగస్టు 25**

జానపద కళలకు ప్రభుత్వాలు మరింత ప్రాధాన్యత ఇచ్చి కళాకారులను ఆదుకోవాలని ప్రముఖ సినీ గేయ రచయిత, రచయిత సుద్దాల అశోక్ తేజ కోరారు. జానపద కళలు అన్ని కళారూపాలకు మూలమని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు జానపదం ప్రాణమని ఆయన అన్నారు.జానపద కళల పరిరక్షణ కోసం తెలంగాణ జానపద అకాడమీతో పాటు ప్రత్యేక జానపద యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని, జానపద కళలకు ప్రత్యేకంగా రూ.100 కోట్ల బడ్జెట్ కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని టీపీఎస్‌కే, కోవిదా కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'జానపద జాతర--సకల కళల సమ్మేళనం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో తెలంగాణతో పాటు తెలుగు నేలకు చెందిన పలువురు జానపద కళాకారులు వివిధ కళారూపాలను ప్రదర్శించారు.కళారూపాల ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సుద్దాల అశోక్ తేజ, కోవిదా సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు, కళాబంధు డాక్టర్ పి. అనూహ్య రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ జానపద కళలకు మరింత ప్రభుత్వ ప్రోత్సాహం అవసరమన్నారు. గత కొన్నేళ్లుగా జానపద కళాకారుల సంక్షేమంపై తగినంత దృష్టి పడలేదని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి కళాకారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో డప్పు, జానపద కళాకారులు కీలక పాత్ర పోషించారని, అలాంటి కళాకారులకు ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.వృద్ధాప్యానికి చేరుకున్న జానపద కళాకారులకు పింఛన్లు అందించాలని, వృత్తి కళలను నమ్ముకుని జీవిస్తున్న కళాకారులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆయన కోరారు. జానపద కళల చరిత్రను భావితరాలకు వారసత్వంగా అందించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని, వెంటనే జానపద యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కళాబంధు డాక్టర్ పి. అనూహ్య రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ అనేక కార్యక్రమాల ద్వారా ముఖ్యంగా వృత్తి కళాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. జానపద జాతర కార్యక్రమాన్ని టీపీఎస్‌కేతో కలిసి నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని నాగార్జున యూనివర్సిటీతో తమ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుందని తెలిపారు. 14 సంవత్సరాలు నిండిన కళాకారులకు వివిధ ప్రభుత్వ నాట్య పరీక్షల్లో అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. అలాగే 6 నుంచి 14 సంవత్సరాల వయసున్న పిల్లలకు



2026--27 విద్యా సంవత్సరం నుంచి పరీక్షలు నిర్వహించి, వారికి శిక్షణ అందించే అవకాశాలను కల్పించనున్నట్లు వెల్లడించారు.సంగీత, నాట్య గురువులు, విద్యార్థులను ప్రోత్సహించేందుకు నాగార్జున యూనివర్సిటీతో కలిసి అవార్డులు అందించనున్నట్లు ఆమె తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ కళా విభాగం ప్రస్తుతం తంజావూరులో ఉందని, అలాంటి జోనల్ కళా విభాగాన్ని తెలంగాణలో ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.అర్హత కలిగిన కళాకారులను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వారికి ఉచిత భోజన, వసతి, వైద్య, విద్య, గృహ, ప్రయాణ సదుపాయాలు కల్పించాలని డాక్టర్ అనూహ్య రెడ్డి కోరారు.ప్రధాన ఆలయాల్లో కళాకారులకు నాట్య ప్రదర్శనలు ఇచ్చే అవకాశం కల్పించాలని, ప్రదర్శనలకు అవకాశం కల్పించేందుకు కొన్ని దేవాలయాల్లో డబ్బులు వసూలు చేయడాన్ని నిలిపివేయాలని అన్నారు. ఒక జాతి తన జానపదాన్ని కోల్పోతే తన చరిత్రను కోల్పోతుందని, కళాకారులను సమాజం మరిచిపోతే సంస్కృతి భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని పేర్కొన్నారు. జానపదం బతికితేనే తెలంగాణ ఆత్మ బతుకుతుందని అన్నారు.తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ జానపద కళల పరిరక్షణ కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జానపద యూనివర్సిటీ ఏర్పాటు కోసం త్వరలో ప్రత్యేక ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. పల్లె గుండె చప్పుడైన జానపద వాయిద్యాలు, కళాకారుల జీవితం నేడు అనేక సమస్యలను ఎదుర్కొంటోందన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా జానపద కళాకారుల ఆశలు పూర్తిగా నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు.కళలు, గళం, వాయిద్యాలను ఆయుధాలుగా చేసుకుని కళల పరిరక్షణ కోసం కళాకారులు ప్రభుత్వాలను కోరుతున్నారని ఆయన అన్నారు. తెలంగాణ జానపద అకాడమీ ఏర్పాటు, జానపద యూనివర్సిటీ స్థాపన, వృద్ధాప్య పింఛన్లు వంటి డిమాండ్లు పెద్ద కోరికలు కాదని, ప్రభుత్వం తక్షణమే వాటిని పరిష్కరించాలని కోరారు.కోవిదా ఆర్ట్స్ అండ్ కల్చరల్ తరఫున కవి, విశ్లేషకుడు పి.ఎన్. మూర్తి మాట్లాడుతూ తెలంగాణ జానపదం ఒక అశాశ్వతం కాని సాంస్కృతిక సంపద అని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జానపద కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలని కోరారు.కార్యక్రమంలో ప్రముఖ సింహం నంది నాట్యాచార్యులు వరుణ్, చిన్నజీయర్ స్వామి ఆశ్రమ నాట్యాచార్యులు పవన్ కుమార్, నిర్వాహకులు కే. రామలక్ష్మి, జీ. లావణ్య, లక్ష్మీ సౌజన్య, రాధిక, శ్రీనివాస్, లక్ష్మీదేవి, దుబ్బాక సురేష్, వెంకన్న, ఇమ్మడి ఎల్లన్న, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.నృత్య ప్రదర్శనల అనంతరం గురువులు, విద్యార్థులకు కోవిదా ఆర్ట్స్ అండ్ కల్చరల్ అకాడమీ, టీపీఎస్‌కే సంయుక్తంగా బహుమతులు అందజేశారు. సుద్దాల అశోక్ తేజ, డాక్టర్ పి. అనూహ్య రెడ్డి, కవి విశ్లేషకుడు పి.ఎన్. మూర్తి చేతుల మీదుగా పలువురు కళా గురువులను సన్మానించారు.కార్యక్రమంలో 50 మందికి పైగా జానపద, శాస్త్రీయ సంగీత, నృత్య కళా గురువులు, 700 మందికి పైగా కళాకారులు పాల్గొన్నారు.వివిధ జానపద కళారూపాల ప్రదర్శనలతో సుందరయ్య విజ్ఞాన కేంద్రం కళల సందడితో కళకళలాడింది.

## కూనూర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా వనమహోత్సవం





**తెలుగు గళం న్యూస్ జఫర్గఢ్ ఆగస్టు 25**

మండలంలోని కూనూర్ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మాస్ ప్లాంటేషన్ కార్యక్రమంతో పాటు పాఠశాల వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాటం దేవేంద్ర, ఉప సర్పంచ్ ఐలయ్య, వార్డు సభ్యులు, ఎంపీవో మధుసూదన్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, పాఠశాల హెచ్ఎం పర్వాజ్, స్టాఫ్ సెక్రటరీ రమేష్ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఫీల్డ్ అసిస్టెంట్ రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వాతావరణ సమతుల్యత, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పాఠశాల ఆవరణను పచ్చదనంతో నింపేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ మొక్కల సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని ప్రతిజ్ఞ చేశారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు



**తెలుగు గళం న్యూస్ పాలకుర్తి ఆగస్టు 25**

పాలకుర్తి మండలం దుబ్బతండా ఎస్పీ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ సర్పంచ్ హపావత్ మంజుల భర్త నరేష్, ఉపసర్పంచ్ భూక్య కిషన్, వార్డు సభ్యుడు గూగులోతు జలంధర్, బీఆర్ఎస్ గ్రామ యూత్ అధ్యక్షుడు బుక్య బాలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగు శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, శాతపురం గ్రామ మాజీ ఉపసర్పంచ్ మారుజోడు సంతోష్, దుబ్బతండా మాజీ ఉపసర్పంచ్ బానోతు కిషన్, భూక్య భాస్కర్, భూక్య చిన్న తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో మహారాష్ట్ర కార్మికుడు మృతి

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి చిట్యాల**



విద్యుత్ స్తంభంపై పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంటు షాక్ తగిలి మహారాష్ట్రకు చెందిన కార్మికుడు మృతి చెందినట్లు ఎస్సై పోచంపల్లి సతీష్ తెలిపారు.ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా నందవర్ధన్ గ్రామానికి చెందిన తాత్మేశ్వర్ పత్రోజీ, అతని సోదరుడు సచిన్ పత్రోజీ గత కొన్నేళ్లుగా ఓ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ వద్ద విద్యుత్ వైర్లు లాగే పనులు చేస్తున్నారు.ఈ క్రమంలో మంగళవారం ఉదయం చిట్యాల గ్యాస్ గోదాం సమీపంలో విద్యుత్ స్తంభంపై ఎక్కి వైరు కట్ చేస్తుండగా,ప్రమాదవశాత్తు ఆ వైరు పక్కనే ఉన్న రన్నింగ్ లైన్‌కు తగిలింది.దీంతో తీవ్ర విద్యుదాఘాతానికి గురై తాత్మేశ్వర్ స్తంభంపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు.గమనించిన తోటి కార్మికులు వెంటనే అతడిని చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా,అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## సిపిఎం సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డికి ఘన నివాళి



**తెలుగు గళం న్యూస్ హైదరాబాద్/ స్టేషన్ ఘనపూర్ ఆగస్టు 25**

సిపిఎం సీనియర్ నాయకుడు, రైతు ఉద్యమ నేత కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి భౌతికాయానికి సిపిఎం ఘనపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని సిపిఎం స్టేట్ ఆఫీస్ వద్ద మంగళవారం ఆయన భౌతికాయంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఇర్రి అహల్య, ఘనపూర్ మండల కార్యదర్శి మునిగెల రమేష్, మండల కమిటీ సభ్యులు తోడెంగల ఐలయ్య, రంగరాయిగూడెం ఉపసర్పంచ్ మునిగే నరసింహులు, మంద మహేందర్, కత్తుల రాజు, పార్టీ నాయకులు వంగపండ్ల సోమయ్య, జిల్లపెల్లి కొమురయ్య, గోడిశాల యాదగిరి తదితరులు పాల్గొని సారంపల్లి మల్లారెడ్డి సేవలను స్మరించుకున్నారు.అలాగే రైతు సంఘం నాయకులు లింగనబోయిన కుమార్, మంద మొగిలి, జిల్లపెల్లి ఉప్పలయ్య, ఇప్పగూడెం మాజీ ఉపసర్పంచ్ గోడిశాల యాదగిరి తదితరులు భౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.రైతులు, కార్మికులు, పేదల హక్కుల కోసం సారంపల్లి మల్లారెడ్డి చేసిన పోరాటాలు చిరస్మరణీయమని నాయకులు పేర్కొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ.. మహిళా సంఘాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన

### హాజరైన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్సార్)

### పేదల సంక్షేమానికే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి**

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఆహార భద్రత,పారదర్శక సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు.కొత్తపల్లి గోరి మండలంలోని సుల్తాన్‌పూర్,కొత్తపల్లి గోరి,చిన్నకోడపాక గ్రామాల రైతు వేదికలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. అనంతరం జగ్గయ్యపేట, సుల్తాన్‌పూర్, కొత్తపల్లిగోరి, చిన్నకోడపాక, చెన్నాపూర్ గ్రామాల్లో స్వయం సహాయక మహిళా సంఘాల భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తోందన్నారు. మహిళల ఆర్థిక సాధికారతకు స్వయం సహాయక సంఘాలు కీలకమని, వారు సమావేశాలు,శిక్షణలు నిర్వహించుకోవడానికి ఈ వీవో భవనాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారత,రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## వన మహోత్సవంతో, పచ్చని వాతావరణానికి శ్రీకారం

### వనమహోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్



**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రం లోని ఎల్లంపేట గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన వనమహోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రామచంద్రనాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని వన మాహోత్సవ కార్యక్రన్ని ప్రారంభించి మొక్కను నాటారు,చిన్నగూడూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల,ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని,మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు, మరిపెడ ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, స్థానిక సర్పంచ్ గండి రాధమ్మ, మండల పార్టీ అధ్యక్షులు గుగులోత్ రవి నాయక్,గ్రామ పార్టీ అధ్యక్షులు గండి వీరభద్రం, గండి మహేష్, పరమేష్,మండల నాయకులు,ప్రజాప్రతినిధులు, అంగన్వాడి,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొని మొక్కలు నాటారు.

## యూరియా యాప్‌ను రద్దు చేసి పాత పద్ధతిలోనే యూరియా అందించాలి"




**సత్తుపల్లి,ఆర్ సి,ఆగస్టు 25 (తెలుగుగళం) న్యూస్:**

యూరియా కొరతను నివారించి, రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గంగారం గ్రామ ప్రాథమిక సహకార సొసైటీ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం రైతులతో సంతకాల సేకరణ చేపట్టారు.

ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ మాట్లాడుతూ.. యూరియా కోసం అమలు చేస్తున్న యాప్ విధానం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. యాప్‌లో నమోదు, సాంకేతిక సమస్యలు, సర్వర్ సమస్యల కారణంగా రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందన్నారు. చిన్న, సన్నకారు రైతులు మరింత ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.యూరియా యాప్ విధానాన్ని వెంటనే రద్దు చేసి, గతంలో మాదిరిగానే పాత పద్ధతిలో రైతులకు అవసరమైనంత యూరియాను సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ప్రతి రైతుకు యూరియా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, రైతులకు న్యాయమైన ధరకు ఎరువులు అందేలా ప్రభుత్వం పర్యవేక్షణ పెంచాలని కోరారు.రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి యూరియా కొరతను నివారించాలని, యాప్‌ను రద్దు చేసి పాత పద్ధతిని కొనసాగించాలని సీపీఎం డిమాండ్ చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు కువ్వారపు లక్ష్మణరావు, కావూరి వెంకటేశ్వరరావు, గుంట్రూ జయరాజు, పటాన్ తనిషా, బెజవాడ లక్ష్మీనారాయణ, బండారు వెంకటేశ్వరరావు, వేమాల బ్రహ్మారావు, గుండి సింగరాజు, వసంతరావు, ఈర్ల శ్రీను, చీపు సత్యనారాయణ, పాకనాటి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు గళం
సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

బుధవారం,
26 ఆగస్టు 2026



# సారంపల్లి మల్లారెడ్డి లాంటి గొప్ప ప్రజా నాయకున్ని కోల్పోవడం అత్యంత బాధాకరం



తెలుగు గళం న్యూస్ హైదరాబాద్, ఆగస్టు 25

రైతు ఉద్యమ నాయకుడు, అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు, సీపీఎం సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి మృతి దేశ రైతాంగ ఉద్యమానికి తీరని లోటని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు.హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సీపీఎం కార్యాలయం ఎంబీ భవన్‌లో ఉంచిన సారంపల్లి మల్లారెడ్డి భౌతికకాయానికి కడియం శ్రీహరి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డితో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ..జీవితాన్నే పోరాటంగా భావించి ప్రతి క్షణం వ్యవసాయరంగ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం పరితపించిన నిబద్ధత కలిగిన రైతు ఉద్యమ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి అని కొనియాడారు.అఖిల భారత రైతు సంఘం నాయకుడిగా, కమ్యూనిస్టు నేతగా రైతాంగ సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించి రైతుల హక్కుల కోసం నిరంతరం పోరాడారని గుర్తుచేశారు.రైతుల సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన పోరాటాలు చిరస్మరణీయమని అన్నారు. 1987లో తాను రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి సారంపల్లి మల్లారెడ్డి తన వెన్నంటే ఉంటూ అన్ని విధాలుగా ప్రోత్సహించిన వారిలో అత్యంత ప్రథముడని కడియం శ్రీహరి తెలిపారు. మల్లారెడ్డితో కలిసి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నానని, ప్రతి ఉద్యమంలో తనను కన్వీనర్‌గా ముందు వరుసలో నిలిపి రాజకీయంగా ఎదిగేందుకు ఆయన ఎంతో సహకరించారని గుర్తుచేసుకున్నారు.సారంపల్లి మల్లారెడ్డి లాంటి గొప్ప ప్రజా ఉద్యమ నాయకుడిని కోల్పోవడం అత్యంత బాధాకరమని కడియం శ్రీహరి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణం భారత రైతాంగ ఉద్యమానికి, సీపీఎం పార్టీకి, ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీరని లోటని పేర్కొన్నారు.సారంపల్లి మల్లారెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన కడియం శ్రీహరి, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఆంధ్రజోనల్ తైక్వాండో పోటీలలో కృష్ణవేణి స్కూల్ విద్యార్థుల ప్రతిభ

తెలుగుగళం న్యూస్, పామిడి.



తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ మరియు ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 1స్ట్ వెస్టఆంధ్ర జోనల్ తైక్వాండో ఛాంపియన్షిప్ లో కృష్ణవేణి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో చదువుతున్న విద్యార్థులు బంగారు పతకాలను సాధించారు. తలారి సత్య బ్రూస్ లీ,తలారి సత్య గౌరవ్ లీ, పెరుమాళ్ ప్రసన్నలక్ష్మి, కే.పార్థసారధి రెడ్డి, గొల్ల దేవిక, ఈ.జస్మిత, సునీతలు గోల్డ్ మెడల్ సాధించగా, నేనావత్ కీర్తి వన్నెశ్రీ, గిరి ప్రియాలు సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఆర్. అనురాధ రెడ్డి మాట్లాడుతూ కృష్ణవేణి స్కూల్ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలో కూడా రాణిస్తున్నారన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడాఎంతో ముఖ్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆర్. అనురాధ రెడ్డి, ఇంచార్జ్ శశికళ,విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం మరియు పిఈటి మల్లికార్జున పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# 116 సర్వే భూమిపై సమగ్ర విచారణ జరిపి నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

## ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు? -- పరిక శ్రీనివాస్

## పేదల ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ మిగులు భూములను గుర్తించి వెంటనే కేటాయించాలి

తెలుగు గళం మంగపేట, ములుగు :

ములుగు జిల్లా మంగపేట మండలంలోని ఇంటి స్థలాలు లేని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే ఇంటి స్థలాలు కేటాయించాలని ఏజెన్సీ దళితుల సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పరిక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రోజువారీ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అనేక పేద కుటుంబాలకు సొంత ఇంటి స్థలం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొందరు పేదలు బంధువులు, ఇతరుల ఇళ్లను ఆశ్రయిస్తూ జీవించాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న భూములు, అసైన్మెంట్ భూములు, మిగులు భూములను అధికారులు పూర్తిస్థాయిలో గుర్తించి, అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలుగా కేటాయించాలని ఆయన కోరారు. ముఖ్యంగా కమలాపురం గ్రామంలోని 116 సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ అసైన్మెంట్ భూమిపై అక్రమ ఆక్రమణలు, భూముల విక్రయాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. 116 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని కొంతమంది ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకుని లక్షల రూపాయలకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయని, ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని పరిక శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ భూమి అక్రమంగా చేతులు మారుతున్నట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, భూమిని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని కోరారు. పేదల కోసం ఉద్దేశించిన ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని ఆయన పేర్కొన్నారు. 116 సర్వే నంబర్ భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించి, సరిహద్దులను నిర్ధారించి, భూమిపై ఉన్న ఆక్రమణలను తొలగించి అర్హులైన పేదలకు ఇంటి స్థలాలుగా కేటాయించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇంటి స్థలం లేని ప్రతి నిరుపేద కుటుంబాన్ని గుర్తించి పారదర్శకంగా జాబితా రూపొందించాలని, ప్రభుత్వ భూముల లభ్యతను పరిశీలించి దశలవారీగా ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. పేదల సంక్షేమం కోసం ఉన్న ప్రభుత్వ భూములను



రక్షించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో ప్రజల తరఫున మరింత బలమైన పోరాటం చేపడతామని పరిక శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి, 116 సర్వే నంబర్ భూమిపై తక్షణ విచారణ చేపట్టి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని, అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షులు గాజర్ల రాజు మాదిగ, జెట్టి రవీందర్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి ఏరియా ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ ఉద్యోగులకు కన్వినెన్స్ వెహికల్ ఏర్పాటు చేయాలి.

## ఐఎన్టియుసి ఉప ప్రధాన కార్యదర్శి తీగల క్రాంతి కుమార్



సత్తుపల్లి,ఆర్ సి, ఆగస్టు 25(తెలుగుగళం) న్యూస్:

సత్తుపల్లి పట్టణం సింగరేణిలో తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ , ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు సత్తుపల్లి ఏరియా అవుట్ డోర్ ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ ఉద్యోగులకు కన్వినెన్స్ వెహికల్ ఏర్పాటు చేయాలని సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ సరికొండ వెంకటాచారి నీ మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం ఇచ్చిన ఐఎన్టీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి తీగల క్రాంతి కుమార్. తీగల క్రాంతికుమార్ మాట్లాడుతూ సత్తుపల్లి ఏరియా పరిధిలోని జే.వి.ఆర్ ఓసి , కిష్టారం ఓసి , జే.వి.యర్ సి.హెచ్.పి , జే.వి.ఆర్ డిస్పెన్సరీ , గెస్ట్ హౌస్ , ఇల్లందు బంగ్లాస్ మరియు పి.వి.ఎన్ ఆర్ కాలనీకి సంబంధించిన సబ్ స్టేషన్ మరియు ఎలక్ట్రికల్ విభాగానికి సంబంధించిన అవుట్ డోర్ పనులు నిరంతరం కొనసాగుతున్నందున ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ ఉద్యోగులు గనుల ప్రదేశాలకు మరియు కాలనీల సబ్ స్టేషన్ విద్యుత్ అంతరాయాల నివారణ , ఎలక్ట్రికల్ పరికరాల తనిఖీలు సమయానుకూలంగా పూర్తి చేయడానికి రవాణా సౌకర్యం ఎంతో అవసరమైనదని ప్రస్తుతం తగిన రవాణా సౌకర్యం లేక ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని తెలియజేశారు. సత్తుపల్లి ఏరియాలో అవుట్ డోర్ ఎలక్ట్రికల్ వర్క్ సక్రమంగా , వేగవంతంగా నిర్వహించేందుకు అవుట్ డోర్ ఎలక్ట్రికల్ విభాగానికి ప్రత్యేకంగా కన్వీనియన్స్ వెహికల్ ను ఏర్పాటు చేయాలని సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ , ఐఎన్టీయూసీ తరపున జనరల్ మేనేజర్ సరికొండ వెంకటాచారి ని కోరారు. ఏరియా జనరల్ మేనేజర్ సరికొండ వెంకటాచారి సానుకూలంగా స్పందించి ఏరియా అవుట్ డోర్ ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ ఉద్యోగులకు కన్వీనియన్స్ వెహికల్ ఏర్పాటుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు పంపిస్తానని తెలిపారు అని తెలియజేశారు.

# మొక్కల పెంపకాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలి:ఎమ్మెల్యే గండ్ర సత్తన్న

## తిరుమలగిరిలో ఘనంగా వనమహోత్సవం

## హాజరైన ఎమ్మెల్యే జీఎస్సార్,అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి







తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ

భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్సార్) పిలుపునిచ్చారు.మండల పరిధిలోని తిరుమలగిరి గ్రామం బుగులోని వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మొక్కలు నాటారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి మానవాళికి ఇచ్చిన అమూల్యమైన వరమని,పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి ప్రతి కుటుంబం బాధ్యతగా కనీసం ఒక మొక్కనైనా నాటి సంరక్షించాలని సూచించారు.విద్యార్థులు చిన్నతనం నుంచే పర్యావరణ పరిరక్షణను అలవర్చుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి,జిల్లా అటవీ శాఖ అధికారులు,ప్రజాప్రతినిధులు,ఉపాధ్యాయులు,విద్యార్థులు,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రేగొండ రైతు వేదికలో 'ఆత్మ' ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం

## వరి,పత్తి పంటల్లో చీడపీడల నివారణపై రైతులకు అవగాహన

## సలహాలు,సూచనలు అందించిన వ్యవసాయ శాస్త్రవేత్త డా.కె.మదన్ మోహన్ రెడ్డి



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ

మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) భూపాలపల్లి ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్త డా.కె.మదన్ మోహన్ రెడ్డి ముఖ్య వక్తగా హాజరై,ఎల్ నినో కరువు పరిస్థితుల్లో పంటల సాగు,సమీకృత పంటల యాజమాన్యం,ప్రస్తుత పంటల రక్షణపై రైతులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం సాగు చేసిన వరి పంటలో కాండం తొలుచు పురుగు నివారణకు ఎకరానికి 8 నుంచి 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఇసుకలో కలిపి చల్లుకోవాలని సూచించారు.అలాగే పత్తి పంటలో పచ్చదోమ,తెల్లదోమ వంటి రసం పీల్చే పురుగుల నివారణకు లీటర్ నీటికి ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఏడీఏ ఎన్.రమేష్,మండల వ్యవసాయ అధికారి (ఏవో) పెద్ది వాసుదేవరెడ్డి,వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవోలు) గోవర్ధన్,ప్రవీణ్,భరత్ మండల రైతులు పాల్గొన్నారు.



# వన మహోత్సవం సందర్భంగా ఘనంగా మొక్కలు నాటిన విద్యార్థులు

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలి




తెలుగు గళం, ఇల్లందు ఆగస్టు 25



వన మహోత్సవం సందర్భంగా చెన్నంగలగడ్డ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ రకాల మొక్కలను నాటారు.ఈ సందర్భంగా ఇల్లందు ఏటీడీఓ భారతి దేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నామ మాట్లాడుతూ.. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు చిన్ననాటి నుంచే అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఏటీడీఓ భారతి దేవి స్వయంగా మొక్కలు నాటి కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణంలో నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.నాటిన ప్రతి మొక్కకు నీరు అందిస్తూ, అవి చెట్లుగా ఎదిగే వరకు విద్యార్థులు బాధ్యతగా చూసుకోవాలని తెలిపారు.విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు వన మహోత్సవం వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. పాఠశాల పరిసరాలను పచ్చదనంతో నింపడంతో పాటు, మొక్కల సంరక్షణపై విద్యార్థులకు నిరంతరం అవగాహన కల్పిస్తామని తెలిపారు."మొక్క నాటడం ఒక మంచి ఆరంభం.. దాన్ని చెట్టుగా పెంచడం మన బాధ్యత" అనే సందేశంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.